

# అస్తమా...

బి.వి. రమణారావు

బొమ్మ: బాపు

బయిట హోరుమని ప్రళయగర్జన చేస్తూ వర్షం కురుస్తుంటే, నిశ్చలంగా, తదేక ధ్యానంతో పేకాటలో నిమగ్నులై వున్నాం క్లబ్బులో. తపోభంగానికే అవతరించిన మేనకలాగ, బిలియర్డ్స్ రూంలోంచి ఊడిపడి సరాసరి మా టేబుల్‌దగ్గిర కుర్చీలో కూలబడి 'ఇంకా మూర్తిగాడు రాలేదురా?' అంటూ వో ఉరుం ఉరిమేడు పాపారావు.

ఎవరూ పలకక పోయేటప్పటికి 'పావు గంటలో వస్తానని కారు తీసుకుపోయి గంటయింది. ఎక్కడ చచ్చేడో!' అంటూ గొంతుక చించుకున్నాడు.

'ఈ వర్షంలో ఎక్కడ చచ్చినా చావొచ్చు' అన్నాడు ఆచారి అసలు వాడి పేరే ఆల్‌కాంట్ ఆచారి. పైగా ఆరోజు చెయ్యి మరీ భస్మాసుర హస్తంలా గుంది.

'అయినా యింత అర్ధరాత్రి కళ్లజోడుకోసం వెళ్ళకపోతే యేం!' అన్నాడు సుబ్బారావు.

'కళ్లజోడేమిటి!' అన్నాడు పాపారావు ఆచారి పేకట్లోంచి సిగరెట్ తీసి విసుగ్గా వెలిగిస్తూ.

'వాడి కళ్లజోడు మధ్యాన్నం బద్దలయిపోతే, కొత్తదానికి ఆర్డరిచ్చాడుట. ఇప్పుడు దాన్ని తెచ్చుకోడానికి పోయేడు' అన్నాడు రంగనాథం.

'కళ్లజోడున్నా వాడికి కళ్లు కనబడవు. ఎలా డ్రైవ్ చేస్తున్నాడో ఏమిటో!' అన్నాడు శంకరం, కీడు శంకిస్తూ.

'వాడు చస్తే నాకేం! కారు పట్టుకుపోయి చచ్చేడు కదా!' వాపోయాడు పాపారావు.

'వాడికి డ్రైవింగ్ లైసెన్స్ లేదు. ఏ పోలీసు చేతుల్లోనో యిరుక్కుని వుంటాడు. అసలంటూ బతిగుంటే కాస్త ఆలస్యంగా వాడే తిరిగొస్తాడు' అంటూ సముదాయించేడు పద్మనాభం.

'అసలు నువ్వు కారు యివ్వడం వాడి చావుకొచ్చింది' అంటూ యెగదోశాడు సుబ్బారావు.

'ఆ గుడ్డిపీనుగ డ్రైవు చేస్తాడని నాకేం తెలుసు! మీ రెవరైనా కూడా తగులడ్డారేమో ననుకున్నాను' గర్జించేడు పాపారావు.

'ఇంతలోకే ఇంత అర్ధాంతరంగా వాడి చావు ముంచుకొస్తుందనుకున్నామా!'

అన్నాడు రాంభద్రం మూర్తి చావు స్థిరపరుస్తూ.

'బుద్ధిః కర్మానుసారే! పిల్లికి బిచ్చం పెట్టని పాపారావు తన కొత్త కారివ్వడం ఆ కారేక్సిడెంట్‌లోనే మూర్తి చచ్చిపోడం — హుఁ...ఇదంతా ఘటన' అన్నాడు పద్మనాభం.

'వాడి కాలం తీరిపోయింది. వాడు చచ్చిపోయేడు. ఇంతవరకూ మనం ఏడ్చింది వాడి ఆత్మశాంతికి చాలు. పాపారావుబాబ్జీ! పోయిన కారూ మూర్తీ ఎలాగా పోయారు. కాస్సేపు మాతో పేకాడు. నీ ఆత్మకూడా శాంతిస్తుంది' అని నేను సలహా యిచ్చేను.

'సరే కానివ్వండి. ఇంతకంటే చెడిపోయిందేముంది!' అన్నాడు పాపారావు కుర్చీ, టేబుల్ ముందుకు లాక్కుని ఆచారి పేకట్లోంచి మరో సిగరెట్ విచారంగా తీసి వెలిగిస్తూ.

నిజం చెప్పొద్దూ, అందరి మొహాలూ ఒక్కసారి మతాబాల్లాగ వెలిగిపోయాయి. చాలా కాలంగా వీడిచేత పేకాడించి, డబ్బు లాక్కోవాలన్న మా అందరి కోరికా నేటికి ఫలించే అవకాశం చిక్కిందని. చచ్చి స్వర్గాన్నున్న వాడి తల్లిదండ్రులు ఎంతో దూరదృష్టితో వాడికా పేరెట్టి వుంటారు. ఎప్పుడూ పుణ్యానికి ఆమడ దూరంలో వుంటూ సార్థకనాముడనిపించుకున్నాడు పాపారావు.

పాపారావంటే మా అందరికీ యింత ప్రత్యేకమైన అనురాగం ఎందుకయ్యా అంటే మొదటిది— డబ్బెట్టి పేకాడనని భీష్మించడం, రెండోది — పేకాడుకుంటుంటే వెనక్కాల కూర్చుని వొద్దన్నా వినకుండా సలహా లివ్వడం, మూడోది — స్వంత డబ్బెట్టి సిగరెట్లు కొని కాలిస్తే అది దురలవాటైపోతుందన్న సద్బుద్ధితో నియమబద్ధంగా, ఇతరులనే పీడించి కాల్చడం, నాలుగోది — లక్షలు లక్షలు వ్యాపారంలో గడిస్తున్నా, దానధర్మాల సంగతటుంచి, కనీసం చేబదులుకైనా చెయ్యి విదల్చకపోడం—ఇత్యాది శతకోటి కారణాలున్నాయి.

నేను పేక ముక్కలు పంచేను. అందరూ ఉత్సాహంగా ముక్కలు అందుకున్నారు. బిక్కు బిక్కుమంటూ పాపారావు కూడా తీసుకున్నాడు. ముక్కలొకసారి సర్దుకు చూసుకుని ఆచారి పేకట్లోంచి సిగరెట్ తీసి సాలోచనగా అంటిస్తుంటే, ఆచారి 'అలవాటు లేనప్పుడు అలాగ సిగరెట్‌మీద సిగరెట్ కాలిస్తే టి. బి. వస్తుంది' అని బెదిరించి, 'జై పరమేశ్వరా' అంటూ రంగంలోకి దిగి పేకలోంచి ముక్క లాగి చూసీ చూడగానే తేలు కుట్టినట్టు 'ఛీ' అని పడేశాడు. పాపారావు ఆ ముక్క అందుకుని కళ్ళ కద్దుకుని, ముక్కలటు సర్ది యిటు సర్ది 'డీల్ షో' చేశాడు. తర్వాత ఆచారిగారెంత మొత్తుకుంటే ఏం లాభం! అందరం వెర్రిమొహాలేసుకుని ఆల్‌కౌంట్ లిచ్చేం.

చూస్తూండగా రౌండ్ తిరక్కుండా మరో డీల్ షో కొట్టేడు పాపారావు. మాలో సగం మందికి కళ్ళ నీళ్ళపర్యంతం వొచ్చేయి. భగవంతుడు ఎంత నిర్దయుడు! ఇలాంటి కటిక రాక్షసుడికా డీల్ షోలు! ఆచారి సంగతి తల్చుకుంటేనే గుండె తరుక్కుపోతుంది. రోజూ ముక్తసరిగా ఒకటో రెండో బ్యాంకులు పోవడంతో సరిపెట్టుకుంటుంటే ఇప్పటికే నాలుగు బ్యాంకులు పోయాయి. వాడి ధైర్య సాహసాలకీ సహనానికీ మెచ్చయినా భగవంతుడు పాపారావుచేత ముచ్చటకి కనీసం ఒక్కటంటే ఒక్క ఆల్‌కౌంటయినా యిప్పించక పోతాడా అని అనుకుంటుంటే, ఆచారి వేసిన ముక్కతోటే ఠకీమని ముచ్చటగా మూడో డీల్ షో కొట్టేడు పాపారావు. వణికే చేతుల్తో అందరూ పాయింట్లు లెఖ్ఖపెడుతూండగా పాపారావు నీరసంగా ఆచారి పేకట్లోంచి సిగరెట్టు తీసి అంటించబోతుంటే ఆచారి వాడి చెయ్యి పట్టుకుని 'కేన్సరొచ్చి చస్తావు' అంటూ మనసారా శపించేడు.

మొహంలో శాంతం తొణికిసలాడుతూండగా భక్తపోతన ఫక్కీలో 'నాయినా ఆచారీ, తనువులు అశాశ్వతం' అంటూ చిరునవ్వుతో సిగరెట్టు వెలిగించేడు పాపారావు.

'ఒరేయ్! పరమ పాపారావు! ఇలాగ మా సిగరెట్లు పీల్చేసి, మా డబ్బు కాల్చేసి, మా హృదయాల్ని చీల్చేసిన ఈ ఘోరానికి భగవంతుడు క్షమించడు' అని బెదిరించేడు ఆచారి.

'పాపోహం, పాపోహం! నా పాపానికి నిష్కృతిలేదు, నిష్కృతి లేదు. నిష్కృతి లేదు. ఇంక ఈ వెధవ పేకాట మానేస్తాను, సిగరెట్లు ముట్టను' అంటూ పశ్చాత్తాపంతో డబ్బు జాగ్రత్తగా లెఖ్ఖపెట్టుకుని జేబులో వేసుకుని లేచేడు.

దీనికి సాయం అదే సమయానికి మూర్తిగాడు ప్రత్యక్షమై కారు తాళాలు పాపారావు చేతుల్లో పెడుతూ 'పెట్రోలు లేదని చెప్పొద్దూ! రెండు ఫర్లాంగులు దాటకుండా పెట్రోలయిపోయింది. మూడు రూపాయిలిచ్చి కారు తోయించేను. ఐదు లీటర్ల పెట్రోలు కొట్టించేను' అన్నాడు.

'సంతోషం. కృతజ్ఞుణ్ని' అన్నాడు పాపారావు, మనస్సులోనే మూర్తిని దీవిస్తూ.

'పది రూపాయిలయింది, ఇలా పడెయ్యి' అన్నాడు మూర్తి.

'మంచి పని చెయ్యడమే మన ధర్మం. ప్రతిఫలాపేక్ష వుండ కూడదు. అదే నిష్కామ కర్మంటే' అంటూ తన దివ్య సందేశాన్నందిస్తూ మమ్మల్నందర్నీ శిలలుగా మార్చి అదృశ్యమయ్యేడు పాపారావు.

సారధి స్పర్శతో మాలో చైతన్యం కలిగింది. బోయ్ తెచ్చిన టీ తాగేక స్పృహొచ్చింది. సారధి లక్షాధికారయినప్పటికీ, పెద్దమనిషి బుద్ధిమంతుడూను. వచ్చినప్పుడల్లా స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ టిన్‌తో ఠీవిగా మా టేబుల్ ముందర కూర్చుని మోతాదుగా ఒకటో రెండో బ్యాంకులు పంచిపెట్టేసి దర్జాగా వెళ్ళిపోతూంటాడు. మొత్తంమీద దేవతలాంటి మనిషి. జరిగిందంతా విని ఇలాంటి ఘోరానికి ఒడిగట్టిన పాపారావు వొచ్చేజన్మలో—అయి పుడతాడని చెప్పి మమ్మల్ని వోదార్చేడు.

'వొచ్చే జన్మవరకూ ఆగవల్సిందే! ఈ జన్మలో వాడు నాశనమవ్వే అదృష్టం మాకు దక్కదంటావు!' అన్నాడు ఆచారి దుఃఖం వరదలై ప్రవహిస్తూండగా.

'వచ్చేజన్మంటే జ్ఞాపకమొచ్చింది. ఆ జపాన్‌గర్ల్ శుక్రవారం భద్రాపూర్ వొస్తుంది' అన్నాడు మూర్తి.

'ఏ జపాన్? ఏ గర్ల్?' అడిగేడు రాంభద్రం.

'మొన్న సామధ్య పేపర్లో చదవలేదూ! పేరు సీన్యాట. టోకియో

[illegible] ఆ అమ్మాయికిప్పుడు పదకొండేళ్ళు. పన్నెండేళ్ల క్రితం భద్రపూర్ కరణంగారి భార్య కార్ ఏక్సిడెంట్‌లో చచ్చిపోయిందిట. ఆవిడే యిప్పుడు పీన్యాగా పుట్టిందిట. ఈ మధ్యనే పూర్వ జన్మస్మృతి వొచ్చి భద్రపూర్‌ని ఆ కరణంగారిని వాళ్ల చుట్టాలని, పన్నెండేళ్ల క్రితం ఏలావుంటే అలాగ కళ్లకి కట్టేనట్టు వర్ణించిందట. ఇప్పుడు ఆ అమ్మాయితో టోక్యోనుంచీ ఢిల్లీనుంచీకూడా సైంటిస్టులొస్తున్నారు. నేను బయల్దేరి వెడుతున్నాను.' అన్నాడు మూర్తి.

'భద్రపూర్ అంటే...?'

'బెంగుళూర్‌కి డెబ్బై మైళ్ళుట' మూర్తి విశదీకరించాడు.

'పోదామంటే పోదాం పదండి. నా పెద్ద కాతా తీసుగొస్తాను' అన్నాడు సారధి.

'దార్లోనే కవక స్వాములవారి దర్శనం కూడా చేసుగోవచ్చు. ఎల్లుండి తెల్లార గట్ల బయల్దేరెడదాం' ముహూర్తం కూడా నిర్ణయించేడు మూర్తి.

మేమందరం ఇలా వూరెళ్లదల్చుకున్నామని, మెటర్నిటీ హోంలో వున్న మా ఆవిడకి చెప్పేను. నేను ఈ పరిస్థితుల్లో యిల్లు విడిచివెడితే ఆ నాలుగు రోజుల్లోనూ సంభవించడానికి అవకాశముండే మా ఆవిడకి పురుడూ, మా అబ్బాయికి రోగం తిరగబెట్టడం, మా తమ్ముడికి ఉద్యోగం పోవడం, మా బావమరిదికి ట్రాన్స్‌ఫర్ జరగడం, మా చెల్లెలికి పెళ్లివారు రావడం, మా వంటవాడు దాసీదాన్తో లేచిపోవడం మొదలయిన తొంభయ్యేడు ప్రమాదాలూ ఏకరవు పెట్టింది. వెళ్లనని మాట యిచ్చేను కాని మనస్సులో వెళ్లడానికే నిశ్చయించుకున్నాను. వైర్‌లెస్ మెసేజ్ అందినట్టుంది — మా అబ్బాయి కూడా రాత్రి నా పక్కలో పడుకుని వూరెళ్లొద్దని ఒకటే రాగం. వెళ్లననీ, ఆడినమాట తప్పనని, హరిశ్చంద్రుడంతవాణ్నని అబద్ధమాడి వాణ్ణి జోకొట్టేను.

ఆశ్రమంలో వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. చుట్టూవున్న ఆవరణలో దట్టంగా పెరిగిన మామిడి, వేప, నేరేడు, యూకలిప్టస్ చెట్లున్నాయి. వాటి నీడలో వేలాదిమంది కూర్చున్నారు. నిశ్శబ్దంగా కొందరు పుస్తకాలు చదువుకుంటున్నారు. కొందరు వేదాంత చర్చల్లోనూ, కొందరు స్వామి మహిమలను గురించి సంభాషణల్లోనూ నిమగ్నులై వున్నారు. ఆశ్రమం మధ్యలో నాలుగెకరాల మేరకు పూలతోట వుంది. వాటికి భక్తులు బిందెలతో నీళ్లు పోస్తున్నారు. పూలతోట మధ్యవున్న భవనమే ప్రశాంతి నిలయం. అందులోనే స్వామి వుంటారు.

మా కదే ఆశ్రమం చూడటం మొదటిసారి. తోటలో ఓ చెట్టు కింద చేరేం. చల్లగా హాయిగా వుంది. వదుం వాల్చేం. సాయంత్రం నాలుగు గంటలయింది. ఒక్కొక్కళ్లే లేచి మందిరంవైపు వెడుతున్నారు. మా కో వలంటీరుతో పరిచయమయింది. ఆయనో డాక్టరు: సారధి స్నేహితుడీ తమ్ముడుట. ఆయనే సారధిని ఆనవాలుపట్టి పలకరించేడు. స్వామి మహిమలను గురించి మాకు చాలా విషయాలు చెప్పేడు. తరచు ఆశ్రమానికొచ్చి పది పదిహేను రోజులుండి అక్కడ భక్తులకు చెయ్యగలిగిన వైద్య సహాయం ఏమయినా వుంటేచేసి, స్వామిదర్శనం చేసుకుని వెడుతూవుంటాడుట.

'మా కేమయినా, మీ పలుకుబడితో ప్రత్యేక దర్శనం యిప్పించగలరా?' అంటూ అడిగేడు మూర్తి.

'ఇక్కడలాంటి రికమండేషన్లు లేవు. ఎవళ్ల దృష్టం వాళ్లది. స్వామి బయటకొచ్చేటప్పడికి అందరూ బారులు తీరి కూర్చుంటారు. అందులో స్వామే స్వయంగా కొందరిని ఏరి వాళ్లకి ప్రత్యేక దర్శన మిస్తారు. ఇన్నివేల మందిలోనూ రోజూ అలాంటి అదృష్టం ఏ డెభ్భయి ఎనభై మందికో కలుగుతుంది.' అన్నాడతను ఎన్నో తన అనుభవాల్ని కూడా చెప్పి.


'స్వామి పిలిస్తే, మన కేమయినా కోరికలూ సందేహాలూ వుంటే అడగొచ్చునా?' అడిగేను నేను.

'మీ కలాంటి శ్రమ వుండదు. మీ మనస్సులోవున్న వాటి కన్నిటికీ వారే సమాధానలిచ్చేస్తారు' అన్నాడతను.

'నాకీ ఆల్‌కాంట్ శాపం పోయేలాగ రక్షరేకడగాలని వుంది' అన్నాడు ఆచారి.

'ఈ జపాన్ గర్ల్ సంగతికేంగాని, నా పూర్వజన్మ వృత్తాంతం చెప్పమని అడుగుతాను' అన్నాను నేను.

'మన కెవళ్ల కవకాశమొచ్చినా పాపారావు పూర్వ జన్మ వృత్తాంతం తెలుసుకోవాలి. ఆ కీలక మేమిటో తెలుసుకోడం మనందరికీ అవసరం' వంతపాయిచ్చేడు రాంభద్రం.



# అసతోమా...

మేమందరం కో వరసగా కూర్చున్నాం. అందరిదృష్టి వరండాలో వున్న తలుపు మీదేవుంది. అనిర్వచనీయమైన పవిత్రత యేదో పరిమళంలాగ ఆ వాతావరణంలో సమ్మిళితమై వుంది. ఆ ప్రశాంత నిశ్శబ్దతలో భక్తి విశ్వాసాల పదధ్వని స్పష్టంగా వినబడుతుంది.

నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుకుండా స్వామి. అందం, ఆనందం, శాంతం, ప్రేమ అనే పదార్థాలతో పోత పోసి బ్రహ్మ సృష్టించిన ఆ మూర్తి, అడుగులో అడుగు వేసుకుంటూ అందరి మధ్యనా నడుస్తూంటే, అందరూ పాద నమస్కారాలు చేసుకుంటున్నారు. నేను ఎప్పుడు చేతులు జోడించేనో నాకే తెలీదు. మా వాళ్ళూ అదే తన్మయావస్థలో వుండటం చూసి, ఏదో ప్రబలమైన దివ్యశక్తి అధీనంలో వున్నామని గ్రహించేను.

స్వామి మధ్యమధ్య కొందరిని వేలుతో చూపెడుతున్నారు. వాళ్ళు లేచి వరండాలో కూర్చుంటున్నారు. వాళ్ళకే ప్రత్యేక దర్శనమన్న మాట. అప్పుడే ఓ పాతిక మందిని ఏరేరు. అందులో వికలాంగులూ, దరిద్రులూ, ఐశ్వర్యవంతులూ, వయోవృద్ధులూ, యువతీయువకులూ, సనాతనులూ, అధునాతనులూ అందరూ వున్నారు. మా వరసలోకి పాదాలు మళ్ళగాన నా గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలెట్టేయి. ఎటువంటి ఆధ్యాత్మిక జిజ్ఞాసా లేకుండా ఏదో వినోదం కోసం వచ్చిన వాళ్ళం, దూరంగా నిలబడి ఓ నమస్కారం చేసి వెళ్ళిపోక ఇక్కడ చతికిలబడ్డాం. తీరా నన్ను పిలిచి ఈ పేకాటా సిగరెట్లూ మొదలయినవి మానేసి ఏ భజనో పూజో చేసుకోమని ఆదేశిస్తే, పదిమందిలోనూ నా బ్రతుకేం గాను! ఏమిటో చూసి చూసి యిలాంటి యిరుకులో పడ్డాను అనుకుని ఏదో పది మందితోబాటూ పాదనమస్కారం చేసుకుని భాగ్యంతో సరిపెట్టి ఎటువంటి ప్రత్యేకమైన అనుగ్రహం నా మీద ఆయన చూపెట్టకుండా వుండాలని ముక్కోటి దేవతలకి అక్షణంలో అనంత కోటి ప్రార్థనలు చేశాను. పాదాలు నా దగ్గర కొచ్చీ కొద్దీ నాకు ముచ్చెమటలు పోస్తున్నాయి. వొచ్చేయి. ఆగేయి. విధి బలీయం. నా శిరస్సుమీద స్వామి దివ్య హస్తం క్షణం నిలిచింది. లేచేను వరండా మీదకి వెళ్ళమన్నాడు వలంటీరు. మా వాళ్ళందరూ నాకేసి జాలిగా 'పాపం! ఇక వీడు మనకి దక్కడు' అన్న భావంతో చూస్తున్నారు. విధి నిర్ణయానికి తలవొగ్గి వరండా మీదకి నడిచేను.

నా వంతు రాగానే భయం భయంగా లోపలికెళ్ళేను. స్వామి ముఖంలోకి చూడగానే భయం పోయింది. వెయ్యి తల్లుల ప్రేమను మాటల్లో నింపుతూ బుజాలు నిమురుతూ 'నువ్వు రావడం చాలా సంతోషం బంగారూ. జనన మరణాల గురించి ఆలోచించడమే ఆధ్యాత్మిక జిజ్ఞాసకు ప్రథమ సోపానం. ఇప్పుడా జపాన్ బాలిక పూర్వజన్మ వృత్తాంతం గురించి తెలుసుకోవాలన్న కుతూహలంతో బయలుదేరేరు మీరంతా. అజ్ఞాతంగా మిమ్మల్ని వేధించే సందేహాలను నివృత్తి చేసుకోడానికి ఇది మంచి సదవకాశం. అయితే పునర్జన్మ వున్నట్లు మీకు నమ్మకం కలిగిన తర్వాత మీ ప్రవర్తనలో రావల్సిన పరివర్తనను గురించి ఆలోచించేరా?' అన్నారు మందహాసంతో స్వామి.

'నా పూర్వజన్మను గురించి తెలుసుకోవాలని వుంది స్వామీ' అన్నాను ధైర్యం చేసి.

'ఉన్న ఈ సంసార ఝంఝాటం చాలక, నీ పూర్వజన్మ బంధువులతో ఇప్పుడు సంపర్కం!' అన్నారు మృదువుగా.

'నా పూర్వజన్మ విశేషాలు తెలుసుకుని, జీవుల జన్మాంతర సంబంధాలు లోకం అంతా చాటుతాను. నేనో పత్రికా సంపాదకుణ్ణి.' అన్నాను.


'నీ తరం కాదు. నీ మాటలు నమ్మరు. నిన్ను కూడా ఆ జపాన్ గర్ల్‌లాగే వింత జంతువులాగ చూస్తారు. నీ ముక్కూ, చెవులూ, మెదడూ సైంటిస్టులు పరీక్ష చేస్తానంటారు.'

'సహేతుకంగా, నిదర్శనలతో రుజువు చేస్తాను.'

'ఇదివరకూ చేశారు. ప్రయోజనంలేదు. అసలు కారణం వాళ్ళకి నమ్మకం లేకపోవడం కాదు. నమ్ముతున్నామని ఒప్పుకునే ధైర్యంలేక, నమ్మకుండా వుండే అవకాశం ఎప్పటికైనా లభిస్తుందేమోనన్న భ్రమ చేత.'

'పోనీ నా అనుభవం కోసమైనా నా కోర్కె తీర్చరా?'

'అది నువ్వనుకున్నంత సులభం కాదు. మహాజ్ఞానులు కూడా సులభంగా తాళజాలని అనుభవం. పూర్వజన్మస్మృతి లేకపోవడమనేది భగవంతుడు మానవునికిచ్చిన వరం.



కాళ్ళూ చేతులూ ముక్కూ చెవులూ కళ్ళూ మేధస్సు మొదలయిన పరికరాలతో అద్భుతమైన శరీరాన్ని ప్రసాదించిన భగవంతుడికి మానవుడికి జ్ఞాపకశక్తి ఎంత వరకూ అవసరమో తెలుసు' అన్నారు స్వామి నా బుజాలు ప్రేమతో తడుపుతూ.

'మరి ఆ జపాన్ గర్ల్‌కెలా వొచ్చిందా పూర్వజన్మ స్మృతి?'

'పూర్వజన్మలో సంస్కారం యొక్క తీవ్రమైన ప్రభావంవల్ల.'

'పూర్వజన్మ సుకృతంవల్ల స్వామి దర్శనం. అనుగ్రహం లభించేయి. కష్టమో నష్టమో నాకై నేను కోరుకుంటున్నాను. నాకు పూర్వజన్మ స్మృతి ప్రసాదించండి.' అన్నాను ప్రాధేయపూర్వకంగా.

'కోరి కోరి జీవితంలో సుఖశాంతులకు దూరమవుతానంటున్నావు.'

'పోనీ కనీసం క్రిందటి జన్మలో నే నెవర్నో చెప్పండి స్వామి.'

'సరే. విను. రహస్యంగా వుంచుకో. ఎల్లుండి రాత్రి, అంటే శుక్రవారం రాత్రి ఏ యింట్లో వుంటావో అదే క్రిందటి జన్మలో నువ్వు పుట్టి పెరిగిన యిల్లు. క్రిందటి జన్మలో నీ మొదటి భార్య పేరు లక్ష్మి. ఆమె నీమీద మమకారం చావక చనిపోయి ఈ జన్మలో నీకు అన్నగా పుట్టి నిన్ను పెంచి పెద్దవాణ్ని చేశాడు...'

'ఈ మధ్యనే చనిపోయాడు స్వామీ.' అన్నాను.

'అవును. అతనే నీకు మళ్ళీ కుమారుడిగా పుట్టబోతున్నాడు. ఎల్లుండి నువ్వు నీకు నలభయ్యేయేట విషం పెట్టి చంపిన నీ రెండో భార్యని కూడా చూస్తావు. అప్పట్లో మీ కుటుంబానికి గర్భశత్రువయిన రాఘవులు చావు నీ కళ్ళతో నువ్వే చూస్తావు. ఈ జన్మలో ఆ రాఘవుల పేరు రాజా. మరింక లాభంగా వెళ్ళి క్షేమంగా రా' అంటూ దీవించి పంపించేరు.

నచ్చుతున్నది వరమో శాపమో అర్థం కాని అయోమయ స్థితిలో బయట పడ్డాను. నన్ను ఎక్కడికి వెళ్ళమన్నదీ ఎందుకు బయలుదేరమన్నదీ చెప్పకుండా వెళ్ళిరమ్మన్నారు. మా వాళ్ళందరూ నన్ను చుట్టుముట్టి ఆశ్రమంలో దూరంగా తీసుకుపోయి ప్రశ్నల వర్షం కురిపించేరు. పేకాటకి పనికొచ్చే వరం పుచ్చుకున్నావా అని ఒకడూ, పాపాన్ని మరణ రహస్యం తెలిసిందా అని ఒకడూ ఇలా రకరకాల ప్రశ్నలతో వేధించేరు. నేను నోరు విప్పలేదు. దీనికి సాయం నా తిరుగు ప్రయాణం గురించి నిర్ధారణ చేసుకోలేను. వానా దీనా 'వైకుంఠానికి మంచి పూరుమీదు గానే వెళుతూంటే వుత్తరం రాయి. కనబడి పలకరిస్తాం. నువ్వు తిరిగొచ్చేక చచ్చినా నీతో పేచీడం. ఏమయినా యిదే మా శ్రద్ధాంజలి' అంటూ నా హోల్డాల్ బయటికి గిరవాటెట్టి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి ఆశ్రమంలోనే గడిపేను. ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనం అయ్యేక నా సమస్యను గురించి ఆలోచిస్తూ ప్రార్థనామందిరం నుంచి తిరిగి వొస్తూంటే నిన్నటి వలం టీరు ఎదురయ్యేడు. 'ఎల్లుండి రాత్రి ఏ యింట్లో వుంటానో ఆ యింట్లో నే

కూరలూ గుణాలూ:

## గజ్జేరు ఆకు కూర

గజ్జేరు ఆకు కూర వండి, నేతితో వేగించి కొన్నాళ్ళు తిన్నట్లయిన — ఉబ్బస, కఫం, శ్వాస, గుల్మం, వాతం, అష్టశూలలు కడుపుబ్బు గల వారికి ఎంతో మేలు చేకూరుతుంది.

దీని వేళ్ళు లేక ఆకుల రసం లేదా కషాయం తగు మోతాదులో వాడితే, అతిమూత్రం, కాస, శ్వాస, ఉదర రోగం, మూలవ్యాధి, కడుపు పొంగు, గుల్మం, పాండువు, క్షయ, లివర్, లంగ్సు వీనిలో పుండు రోగము గలవారు పుచ్చుకున్నట్లయిన ఆయా రోగాలు తగ్గుతాయి.

ఈ కూర ఎక్కువ దినాలు అమితంగా తిన్నట్లయిన గొంతుక నొప్పి వస్తుంది. దీనికి విరుగుడు కాఫీ.

## చింత చిగురు

సాధారణంగా చింత చిగురు పచ్చడి చేస్తూ వుంటారు. లేదా పులుసులో వేసి వండుతారు.

శుద్ధి. మేహశాంతి చేస్తుంది. పైత్య కఫమున శుభ్రపరుస్తుంది. వాతం, మొలకలు గల మూలవ్యాధి, గుల్మం, క్రిమి, దురద, కఫం, వీనిని అణచి వేస్తుంది. వీర్యానికి వేడి పుట్టిస్తుంది. నీరసాన్ని పోగొడుతుంది.

గురుత్వంగా వుంటుంది. అగ్ని మాంద్యం చేస్తుంది. నేత్ర రోగన్ని కలుగజేస్తుంది. కొంచెం శ్లేష్మం, పైత్యం చేస్తుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్ళు:

1. అల్లం 2. మిరియాలు.

## బలుసు ఆకుకూర

బలుసు ఆకు కూర చలవ చేస్తుంది. గ్రహణీ రోగాన్ని, వింశతి మేహాన్ని, పైత్యాన్ని జయిస్తుంది. జ్వరాన్ని తగ్గిస్తుంది. ఈ ఆకులు వేసి వండిన పులుసు గ్రహణీ, రక్త గ్రహణి గల రోగులకు మిక్కిలి పథ్యమయినది. పచ్చడి పైత్యాన్ని తగ్గిస్తుంది.

సేకరణ:- ఆకుండి నారాయణమూర్తి

అపూర్వ సంఘటన జరుగుతుంది వెళ్ళ దా అన్నారు స్వామి. మరి ఎక్కడికి వెళ్ళ వల్సిందీ చెప్పలేదు' అన్నాను.

'ఇంక దీన్ని గురించి మీరాలోచించ నక్కర్లేదేమీ లేదు స్వామి వెళ్ళ రమ్మంటే వెంటనే వెళ్ళడమే కర్తవ్యం. ఇప్పుడైనా వెంటనే బయల్దేరండి' అని ఆయన సలహా యిచ్చేడు.

బెంగుళూరెళ్ళి అక్కణ్ణుంచి బస్సుమీద భద్రపూర్ వెళ్ళి మన వాళ్ళను కలుసుకుని ఆ ఫాన్ గర్ల్ సంగతి తెలుసుకోవచ్చునన్న ఉద్దేశంతో, రైలు కందిస్తానని భీష్మ ప్రతిజ్ఞ చేసిన బస్ ఎక్కేను. స్టేషన్లో కాలెట్టగానే రైలు వెళ్ళిపోయిం దన్న సమాచారం ఎదురయింది. సరాసరి బెంగుళూరు కేసయినా టేక్సీ దొరుకుతుం దేమోనని ప్రయత్నించేను. విఫలమయింది. గత్యంతరం లేక అంపలిమీదనైనా వెడదా మని హిందూపూర్ వరకూ వెడుతున్న లారీ ఎక్కేము. డ్రైవరు బహు బుద్ధి మంతుడు. అయితే యేం లారీ మహా మొండిఘటం. పదేసిమైళ్ళ కోసారి పేచీ పెట్టడం తర్వాత రాజీ పడటంతో అలా తెల్లారేప్పటికి హిందూపూరు చేరు కున్నాను.

బెంగుళూరులో సమ్మెలూ గొడవలూ గందరగోళంగా వుండటం తాత్కాలికంగా రూటు రద్దు చెయ్యడంవల్ల ఆ రాత్రి హిందూపూర్లోనే గడిపేను. మర్నాడు ఆ ఊళ్ళో వున్న మా పత్రిక స్టాకిస్టు హో ప్రయివేట్ కారులో మధ్యాహ్నానికి బెంగుళూరు చేర్చేడు. కాని ఏం లాభం! కొందరు దేశభక్తులయిన యువకులు నా టేక్సీ డ్రైవరు ముసుగు పెట్టుకుని పడు కుని వుండగా తల అనుకుని పొరపాటున కాళ్ళవైపు పెట్రోలుపోసి అంటించేరుట. దానికి వాడు రెచ్చిపోయి టేక్సీలన్నిటినీ సమ్మెలోకి దింపేశాడుట. ఇంత చిన్న విష యంలో ఇంత రాద్ధాంతం చేస్తే యిక మనం రాజకీయంగా ఎలా పురోగమిస్తాం.


ఒక చోట యూనిఫారంలో వున్న కండక్టర్ని ముచ్చటపడి బాలికలు పచ్చడి కింద తన్నేరుట. అక్కడ బాలురు లేక పోవడం వల్ల బాలికలు కలగజేసుకోవల్సి వచ్చిందనీ, ఉద్యమం అన్న తర్వాత ఇలాంటి పట్టింపులు తప్పు తప్పని నాయ కులు ఎంత చెప్పినా వినకుండా బస్సు సారథులందరూ సమ్మెట!

భావి పౌరులైన విద్యార్థులు కార్యా ర్థులై వచ్చిన వాటిని మచ్చుకొకటి చొప్పున పుచ్చుకుని మిగిలిన ఫలహారాలు 'రిలే హంగర్ (స్ట్రైకర్స్)'కి సకాలంలో అందించాలన్న సత్సంకల్పంతో కార్య రంగంలో నిమగ్నులై వుండగా, ప్రజల కళ్ళుండగానే హోటల్ ప్రొప్రయిటర్ తిరగబడ్డాడంటే ఇంతకంటే అరాచకం ఏముంది! దీని మూలాన్ని హోటళ్ళన్నీ సమ్మెట! ఇదంతా చూసి 'జగమే మాయా' పాట పాడుకుంటూ అలా బెంగుళూరు రోడ్లంట ఫుట్‌పాత్ అయి పోదామనిపించింది.

ఇంతలోకే మా లారీ డ్రైవరు నా భుజం తట్టి 'కష్టసుఖాలు, కావడి కుండలు. భయపడకండి. రేపు సాయంత్రం లోడ్ వేసుకు వస్తాను. మిమ్మల్ని భద్ర పూర్లో దింపుతాను. ఫ్రంట్ సీటు ప్రత్యే కంగా మీకే రిజర్వ్ చేస్తాను. బస్సుకో చిన్న వందరూపాయిలనోటు నా మొహాన్ని పారెయ్యండి' అంటూ సవినయంగా అభయ హస్తమిచ్చేడు. సరేనన్నాను. అతని పేరు ప్రహ్లాదుట. మనిషి కాస్త తండ్రి పోలి కేమో హిరణ్యకశిపుడిలాగున్నాడు. అనేన మాట తప్పకుండా సాయంత్రం ఆరిం టికి లారీ తీసుకొచ్చేడు. ఎక్కి కూర్చు న్నాను.

డ్రయివరు కూని రాగాలు తీస్తూ సిగరెట్లు కాలుస్తూ ఊరు దాటగానే స్పీడెక్కించాడు. డ్రయివరు తాలూకు ప్రొహిబిషన్ పరిమళం వల నయితేనేం, సిగరెట్టు పొగ తాలూకు మేఘాలవల్ల నయితేనేం, మధ్య మధ్య ఎదురయ్యే కార్ల లైట్లు మొహంమీద పడి కళ్ళు చికట్లు కమ్మడం వల్లనయితేనేం, రోడ్ మలుపుల్లో బ్రేకులు చేసే ప్రణవ నాదం వల్లనయితేనేం మొదట్లో దార్లో రోడ్ పక్కనున్న చెట్లు కళ్ళ ద్దుల్లా ట్విస్ట్ డాన్స్ చేసినట్టు కన బడింది. స్పీడెక్కించాక అంతరిక్షయాన మంటే ఏమిటో తెలిసింది. మొత్తం మీద భూమిమ్మీద ప్రయాణం చెయ్యటంలేదని గ్రహించి భగవంతుడిమీద భారంవేసి కళ్ళు మూసుకుని పంచాక్షరీ మంత్రం ప్రారం భించేను. మరి కైలాసం ఎప్పుడు చేరేమో తెలియదు కాని హరహరమంటూ గంగలోకి దొర్లిపోవడం చూచాయగా గుర్తుంది.

ముక్కుకు ఘాటయిన వాసన తగల గానే మెలుకువొచ్చి కళ్ళు తెరిచాను. వరండా మీదలాగుంది మంచం మీద పడు కుని వున్నాను. తలవాల్చి కిటికీలోంచి హాల్లోకి చూశాను. గుమ్మంమీద గోడని పెద్ద ఫోటో వుంది. వంకాయలున్నంత



పురటూయి మరచి స్వర్గ్రధూపి, బొద్దు మీసాలు, ఉంగరాల జుట్టుతోనూ మంచి ఠీవిగా కూర్చుని వున్న విగ్రహం తాలూకు ఫొటో కేసి హరికేన్‌లాంతరు వెలుగులో చూస్తే ఎక్కడో చూపిన మొహంలాగ కనబడింది.

"తెలివొచ్చిందా బాబూ" అన్న పలకరింపు విని ఉలిక్కిపడి తల ఎత్తి పక్కకి చూశాను. పడక కుర్చీ మీద వో ఘటోత్కచుడు సావకాశంగా చుట్ట కాలుస్తున్నాడు. 'అమ్మా! ఈయనికి తెలివొచ్చింది. కొంచెం పాలివ్వు' అంటూ గర్జించింది పడక్కుర్చీ. నడుం వొంగిన డెబ్భయ్యేళ్ల ముసలావిడ వో కంచు గ్లాసుతో వేడి వేడి పాలు అందించింది. నెమ్మదిగా లేచి అందుకున్నాను.




# కానుక

## జీవిత వినోద సంధాయిని

Agfa ® క్లిక్ III రూ 46.50 (పన్నులు అదనం)

**ప్రారంభించటానికి మంచిది. తరువాతఅనుక్షణం కూడా ఉంచుకొనుటకు ఉత్తమం**

క్లిక్ III తో మీబిడ్డను ఛాయా చిత్ర జగతికి పరిచయం చేయండి. దానిని ఉపయోగించటం చాలా సులభం. అడ్జెస్టు చేయవలసిన అవసరం లేదు. మీరు చేయ వలసిన పనల్లా వస్తువును పరిచూడటం, మీట నొక్కటం: ఇది ఎంతో పొదుపైనది కూడాను. రంగులలో కాని తెలుపు నలుపుల లో కాని ప్రతి 120 ఫిలిము రోలుకు సుస్పష్టమైన 12 చిత్రాలను తీయ వచ్చును

అగ్ఫా-గెవార్ట్ వారి సహకారంతో తయారుచేయువారు:
ది న్యూ ఇండియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ —బరోడా

AGI సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
ఆగ్ఫా-గెవార్ట్ ఇండియా లిమిటెడ్
బొంబాయి • న్యూ ఢిల్లీ • కలకత్తా • మద్రాసు.

® ఫొటోగ్రఫిక్ ఉత్పత్తుల నిర్మాతలు అగ్ఫాగెవార్ట్ అంట్‌వెర్ప్ లివెర్క్యుసెన్ వారి యొక్క రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్స్.

ఆగ్ఫా క్లిక్-భారతదేశంలో విస్తార ప్రజాదరణంకల కెమేరా CPIAG-128-203 TEL

'ఎంత గండం గడిచింది బాబూ! పై నుంచి సిమెంట్ బస్తాలు మీద పడ లేదు' అన్నాడు లారీ డ్రయివరు. ఇలాంటి గండపరంపరలు నిత్యం గడవడం, భక్త ప్రహ్లాదుడిలాగ, వీడికి పరిపాటే అనుకుంటాను. 'శుక్రవారం పూట మంచి వర్జ్యంలో బయలుదేరేరు, మరి.' అంది ఆ ముసలావిడ సాగదీసుకుంటూ.

'శుక్రవారం' అన్నమాట వినగానే స్వామి చెప్పిన మాటలు జ్ఞాపకమొచ్చి వెన్నుమీద తన్నినట్లయ్యి పక్కమీద లేచి కూర్చుని పాలు గబగబ తాగేసి అందరి మొహాల్లోకి కలియ చూశాను.

'ఖంగారు పడకండి. లారీ బురదలో యిరుక్కోవడం వల్ల పక్కకి జరిగింది. మీరు కునికిపాట్లు పడుతున్నట్టున్నారు, తలుపు గడియ సరిగ్గా లేదేమో తెరుచుకు బయటకి దొర్లిపడ్డారు. మరేమీ ప్రమాదం లేదు. స్విమిత పడ్డాక కొన్త బట్టలు మార్చుకోండి' అని మరో చుట్ట వెలిగించేడు పడక్కుర్చీలో ఆకారం. వీడే క్రిందటి జన్మలో నా పెద్ద భార్య కొడుకనే ఆలోచన రాగానే వొళ్ళు చల్లబడి వంత పనయింది. సుమారో అరవై యేళ్ళుంటాయి. మంచి ఒడ్డూ పొడుగూ పెద్ద బొజ్జ — మనిషి పర్వతం లాగున్నాడు.

'ఇవిగో వేణ్ణీళ్ళు. కాళ్ళూ చేతులూ మొహం కడుక్కోండి.' వో రాగిబిందె, చెంబు అక్కడ పెట్టిన ఆ ముసలమ్మ

# అసతోమా...

మొహంలోకి పరీక్షగా చూశాను. ఈవిడే క్రిందటి జన్మలో నాకు విషం పెట్టి చంపిన నా రెండో భార్యన్నమాట. డెబ్బయ్యేళ్ళుంటాయి. నడుం కొంచెం వొంగింది. జవసత్త్వలు సన్నగిల్లినా ఆ మాటతీరులోనూ, ఆ కళ్ళలోనూ అధికారం తొణికిసలాడుతుంది. ఇంకా కర్మ పరిపక్వం కాకపోవడం మూలాన్నిలాగుంది మృత్యువుతో పోరాడే దేహదారుఢ్యం మిగిలి వుంది.

ఆ ఫోటోకేసి మళ్ళీ పరకాయించి చూసి క్రిందటి జన్మలో నాకున్న టీవికి మురిసిపోయాను. ఇలాంటి నాకు ఈ ముసలిది విషంపెట్టి చంపిందంటే ఆశ్చర్యమేసింది. ఈ విషయం తెలుసుకుందామన్న కుతూహలంతో నెమ్మదిగా లేచి కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని బట్టలు మార్చుకున్నాను.

'ఈ రాత్రి కిక్కడే విశ్రాంతి తీసుకోండి. ఉదయాన్నే భద్రపూర్ బస్‌మీద వెదుదురుగాని' అన్నాడు మా క్రిం. జ. కొడుకు. వయస్సులో పెద్దవాడు కాబట్టి కృతజ్ఞతతో నమస్కరించి 'మీకు చాలా శ్రమ యిస్తున్నాను' అన్నాను.

'ఎంతమాట! మీలాంటి పెద్దవాళ్ళు మా యింటికి రమ్మంటే మాత్రం వస్తారా! దైవికంగా యిలా వొచ్చేరు.'

'మీరు స్వంత వ్యవసాయం నడిపిస్తున్నారా?' అడిగేను. అతను నిర్లిప్తంగా నవ్వి 'ముప్పైఅయిదు సంవత్సరాలుగా నేను చేసే ముఖ్యమైన పనులేమిటంటే భోంచెయ్యడం, పడక్కుర్చీలో పడుకోవడం చుట్ట కాల్చడం' అన్నాడు.

'జరుగుబాటుంటే అంతకంటే ఏం కావాలి! చేతికందొచ్చిన పిల్లలకి సంసార బాధ్యతలు అప్పగించేసి వుంటారు' అన్నాను.

'అదంతా వో కథ నాయినా! వాడికి సంసారం లేదు చట్టుబండలూ లేదు. వాడూ నేనూ చావలేక బతుకుతున్నాం' అంది నా క్రిం. జ. రెండోభార్య, వో పళ్ళెంలో గారెలూ ఆవడలూ పట్టుకొచ్చి అందిస్తూ.

'ఇప్పుడివన్నీ తినలేనమ్మా...' అన్నాను.

'మా యింటికి అతిధులు వొచ్చి ముప్పైయ్యేళ్ళయింది. ఈ రోజు మా నాన్నగారి తద్దినం. అందుకే ఈపాటి ఫలహారం యిచ్చే భాగ్యానికైనా నోచుకున్నాం' అన్నాడు.

వెన్నెలలో షికారుగా వెళ్ళి కాలవ గటున కూర్చున్నాను. నాకూడా ఆ వూరి రైతొకతను సాయం వొచ్చేడు. వ్యవసాయం, రాజకీయాలు ఎలక్షన్లమీద సింహావలోకనం అయిన తర్వాత ఈ కుటుంబం గురించి అడిగేను.

'ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం బాబూ. ఇప్పుడు చితికిపోయింది. దీనికంతకీ కారణం ఆ ముసల్దేనంటారు. ఈవిడ పెనిమిటి చల్లని మారాజని చెప్పుకునేవోరు. మొదటి భార్య పోతే యీవిణ్ణి చేసుగున్నాడు. ఇప్పుడున్న కరణంగారి తండ్రి రాఘవులని వుండేవాడు. ఆయనే యీ సంబంధం ఈయనికి అంటగట్టేడంట.'


'ఈవిడకి పిల్లలు లేరా?'

'పెళ్ళయిన రెండేళ్ళకే ఆయన పోయేడు. ఈ సవతి కొడుకొకడే మిగిలేడు.'

'పాపం!'

'పాపం పుణ్యం దేవుడికెరుక! అసలు ఆయన చావును గురించే రకరకాల పుకార్లున్నాయి.'

'ఏమని?'



'ఏ రోగం లేకుండా అర్ధాంతరంగా పోయాడంటండి. రాఘవులు యీవిడ కలిసి ఆయనకి విషం పెట్టేరంటారు.'

'రాఘవులుకీ యీవిడకీ బంధుత్వం వుందా?'

'అసలు దూరం చుట్టరికమేదో వుందంట. ఆయన పోయిన తర్వాత ఈవిణ్ణి సవితి కొడుకునీ ఆ రాఘవులే చేరదీసి యింట్లో పెట్టుకున్నాడంట. తర్వాత ఆస్తంతా కాజేసి బయటకి గెంటేసేడంట.'

'మరి ఈ కొడుకేం చదువుకోలేదా?'

'తండ్రి పోయాక మందెట్టి చంపేద్దారని చూసేరంట. భగవంతుడి దయ వల్ల బతికేడు కానండి పాతికేళ్లొచ్చి వరకూ మతిలేక యెర్రి బాగులాడిలా తిరిగేవోడంట. రాఘవులు పోయాక ఈ కరణంగారు ఆళ్లకింత ఆదరవు చూపెట్టి ఇంటికి రప్పించేసేరు. ఏదో తిండిగింజలకి జరుగుబాటుకీ లోటులేదు.'

'మరిప్పుడు సవితి కొడుకుతోనే వుంటుందే!'

'రాఘవులు ఆస్తంతా కాజేసింతర్వాత బుద్ధొచ్చి పిచ్చికుర్రోణ్ణి ఆదరించింది. తర్వాత మందూ మాకూ యిప్పించి దగ్గిరెట్టుకుంది. ఈయన దగ్గిరుండకపోతే ఎక్కడుంటాడండీ! ఊళ్లో వాళ్లు ఆవిణ్ణి చూస్తే స్నానంచేసి మరీ అన్నం ముడతారు.'

మేమిలా మాట్లాడుకుంటూ వుండగా ఏదో లారీ స్పీడుగా వొచ్చి వెనకనుంచి రాసుకుపోయింది. నేను ముందుకు పడ్డాను.

'నాన్నా నాన్నా, నిద్దట్లో పలవరిస్తున్నావు' అంటూ మా అబ్బాయి లేపేడు.

'ఏదో లారీ చప్పుడు...' అంటూనే వున్నాను ఇంకా లారీ చప్పుడు స్పష్టంగా వినబడుతూనే వుంది.

'అవును. మన యింటిముందే ఆగిపోయింది' అన్నాడు మావాడు. బయట ఏదో మాటల సందడి వినబడితే తలుపు తీసుకుని డాబామీదనుంచి కిందకి చూశాను. కాళ్లు గిలగిల తన్నుకు పడివున్న కుక్క కనబడింది.

'ఏం జరిగింది?' అడిగేను డ్రైవర్ని.

'ఏదో కుంటికుక్క బాబూ. లాభం లేదు. చచ్చిపోయింది' అన్నాడు డ్రైవరు పెదవి విరుస్తూ.

'నాన్నా అది 'రాజా.' పక్క వీధిలో కుక్క' అన్నాడు మా అబ్బాయి ...

ఇంతలో టెలిఫోన్ మోగితే వెళ్లి రిసీవర్ ఎత్తగానే హాస్పిటల్ నుంచి మా బావ గొంతు వినపడింది. 'బావా, కంగ్రాచులేషన్స్! ఆడపిల్ల పుట్టింది, అంటే మీ యింట్లో లక్ష్మి వెలిసింది.' ●

